www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 అక్టోబర్ 2025
5
తూర్పుగోదావరి



కామర్స్ ఫ్యాకల్టీకి శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం సిటీ

కామర్స్ ఫ్యాకల్టీకి 3 రోజుల బిఎఫ్ఎస్ఐ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ స్పాన్సర్ చేసి, క్రిస్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్యాంకింగ్, బీమా, మ్యూచువల్ ఫండ్లు, జిఎస్‌టిలు ఉన్నాయి. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే, కామర్స్ ఫ్యాకల్టీకి బిఎఫ్ఎస్ఐ శిక్షణ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు, ఇది విద్యార్థులకు పరిశ్రమ సంబంధిత విద్యను అందించడానికి, వారి ఉపాధిని పెంచడానికి వీలు కల్పిస్తుంది. గ్రంధి సందీప్, పవన్ కుమార్ పొట్టి, రాజశేఖర్ రెడ్డి, క్రిస్ ప్రాజెక్ట్ లీడ్ నరేష్, లీడ్ ప్రశాంత్ వివిధ కళాశాలల నుండి 34 మంది పాల్గొనే వారితో తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు.

అధ్వానంగా ఎస్‌సి హాస్టల్స్ నిర్వహణ

- ఇరుకు గదుల్లో విద్యార్థులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎస్‌సి సంక్షేమ హాస్టల్లో వసతుల కల్పన విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. ఎస్‌సి కమిషన్ కెఎస్.జవహర్ సొంత జిల్లాలో నెలకొన్న ఈ దుస్థితి రాష్ట్రవ్యాప్త పరిస్థితులను అద్దం పడుతోంది. కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేశామని, విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామంటూ తల్లికి వందనం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటనలు నేటికీ చందమని ఎస్‌సి హాస్టల్స్‌ను సందర్శిస్తే తేటతెల్లం అవుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 37 ఎస్‌సి సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. వాటిలో బాలికల హాస్టల్స్ 15 కాగా, బాలుర హాస్టల్స్ 22 ఉన్నాయి. వీటిలో 8 హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకోగా మరో 2 హాస్టల్స్ పూర్తిగా మూత పడ్డాయి. ఈ లెక్కన ప్రస్తుతం కేవలం 27 హాస్టల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ హాస్టల్స్‌లో బాలురు 806 మంది, బాలికలు 1,005 మంది మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టల్స్ మెనూలో మార్పులు చేసిన విషయం విదితమే. ప్రి మెట్రిక్ విద్యార్థులకు నెలకు రూ.1250, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నెలకు రూ.1600 చొప్పున చెల్లిస్తోంది. ఈ లెక్కన ప్రిమెట్రిక్ విద్యార్థులకు రోజుకు రూ.42, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.53 చొప్పున చెల్లిస్తున్నట్లు సుస్పష్టం. కేవలం ఈ నగదుతో విద్యార్థులకు భోజనం అందించటం వార్డెన్లకు కత్తిమీద సాములా మారుతోంది.

కొన్నిసార్లు నెల తరబడి బకాయిలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం 21 హాస్టల్స్‌కు మరమ్మతులు జరుగుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన పాలనా యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ నేపథ్యంలో హాస్టల్స్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు హాస్టల్స్‌లో వసతి కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని హాస్టల్స్‌లో విద్యార్థులు ఇరుకు గదులలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గాలి వెలుతురు రావట్లేదు. కొన్ని చోట్ల మరుగుదొడ్ల సదుపాయాలు లేవు. స్థలం సమస్య కారణంగా విద్యార్థులు తమ వస్తువులను భద్రపరుచుకోవడం ఇబ్బందిగా మారింది. దాదాపు అన్ని హాస్టల్స్‌లో నేలపైనే విద్యార్థులు నిద్రపోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా స్థాయి అధికారులు హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను చక్కదిద్దకపోవడంపై తాజాగా హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అయినప్పటికీ హాస్టల్స్ స్థితి గతుల్లో ఎటువంటి మార్పులు రావడం లేదు. విద్యార్థులు నిద్రించేందుకు బెడ్లు, పరుపులు అందించాలని అవసరమైతే అదనపు బడ్జెట్ కేటాయించాలని ఇటీవల సిఎస్‌కు సూచించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, మరుగుదొడ్లు బాత్‌రూమ్‌లు ఏర్పాటు



హాస్టల్లో కటిక నేలపైన పడుకున్న విద్యార్థులు

చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని తేల్చి చెప్పినా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. మరోవైపు సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో 27 హాస్టల్స్‌కు గాను కేవలం 17 హాస్టల్స్‌కు మాత్రమే వార్డెన్లు ఉన్నారు. మిగిలిన10 ఇన్‌ఛార్జి వార్డెన్లతో నెట్టుకొస్తున్నారు. 27 హాస్టల్స్‌కు మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు కార్మికులు లేరు. దీంతో వార్డెన్లు సొంత ఖర్చులు వెచ్చించి మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారు. ప్రతి నెలా ఖర్చు రూ.15 వేలు చెల్లిస్తున్నారు. మరో ఆరు హాస్టల్స్‌కు వంట చేసే వారు లేరు. మరో నాలుగు హాస్టల్స్‌కు కమాటీలు లేరు. 10 హాస్టల్స్‌కు వాచ్‌మెన్‌లు లేరు. ఇప్పటికైనా పాలనా యంత్రాంగం దృష్టి సారించి జిల్లాలో ఎస్‌సి విద్యార్థుల అవసరాలకు తగ్గట్టు హాస్టల్స్‌ను అందుబాటులోకి తీసుకురావటంతో పాటు, హాస్టల్స్‌లో వసతులు, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి

ప్రజాశక్తి-కడియం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంఎల్ఎ గోరంట్ల

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం బుర్రిలంకలో రూ.205 లక్షల ఉపాధి, మండల పరిషత్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చొరవ, పర్యాటక శాఖ సహకారం, నాటి కలెక్టర్ ప్రశాంతి ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ రోడ్డును నిర్మించగలిగామన్నారు. ఈ రోడ్డు స్థానిక నర్సరీ రైతులకు, ఎస్‌సి సొసైటీ భూములు గల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి, పంచాయతీరాజ్ నిధులతో లింకు రోడ్డు, గ్రామీణ రోడ్లు నిర్మించుకోవడం నిరంతర ప్రక్రియగా ఉంటుందన్నారు. 12 దేశాలతో కనెక్టివిటీ చేయగలిగిన ప్రపంచ స్థాయి గూగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తే దాన్ని స్వాగతించాల్సింది పోయి విమర్శించడమే జగన్ అండ్ కో బ్యాచ్ పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మారిశెట్టి పద్మావతి, ఉప సర్పంచ్ పాతంశెట్టి రామ్‌జీ, కూటమి నాయకులు డాక్టర్ గోరంట్ల రవి కిరణ్, వెలుగుబంటి నాని, గట్టి నరసయ్య, గట్టి సుబ్బారావు, బోడపాటి గోపి, బోడపాటి రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం, కొవ్వూరు

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకూ అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రతార్థం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ రాహుల్ మీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరం లేని సందర్భంలో ఇళ్ల బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాల కారణంగా చెట్లు పడిపోవడం, ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 9494060060కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో నదిలో కార్తీక స్నానాలు చేయడం సురక్షితం కాదని, నది పొంగిపొర్లడం, ప్రవాహం ఎక్కువగా ఉండటం వంటి ప్రమాదాలు ఉంటాయన్నారు.

వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.తిలక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియ చేస్తూ, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

కొవ్వూరు తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్‌డిఒ రాణి సుస్మిత సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. రానున్న నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తుందని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలని సూచించారు.

భారీ వర్షాలకు నేలంటిన వరి

ప్రజాశక్తి-పెరవలి



ఈదురు గాలులకు నేలకు ఒరిగిన వరి చేను

అల్పపీడన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు ఈదురు గాలులకు మండలంలో వరి, కూరగాయ, పందిరి పంటలు నేలనంటాయి. వరి 8,300 ఎకరాల్లో, ఉద్యానవన పంటలు 6500 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట ఈనిక దశలో ఉంది. ఉసులుమర్రు రైతులు పి.126 విత్తన వరి రకం సాగు చేస్తారు. ప్రస్తుతం 70 ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేశారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, పెరవలి, కాపవరం, ముక్కామల, నడుపల్లి, ఖండవల్లి ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాల పైన వరి పంట భారీ వర్షాలు ఈదురు గాలులకు నీట మునిగింది. ప్రస్తుతం పంట ఈనిక దశలో ఉండటంతో భారీ వర్షాలకు కంకి పాలు పోసుకోక తాలు గింజ, పిట్టపోటు గింజ మచ్చ వచ్చి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ముక్కామల, ఖండవల్లి, కాకరపర్రు, అన్నవరప్పాడు తదితర ప్రాంతాల్లో కూరగాయ పంటలు, వంగ, బెండ, పొట్ల, కాకర పందిరి పంటలు మూడు రోజుల వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

వైసిపి జాతీయ అధికార ప్రతినిధిగా భరత్ రామ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి


వైసిపి జాతీయ అధికార ప్రతినిధిగా మార్గాని భరత్‌రామ్ ఎంపిక అయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి యల్లాప్రగడ కార్తీక్‌ను ఎంపిక చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరిద్దరినీ జాతీయ అధికార ప్రతినిధులుగా ఎంపిక చేసినట్లు తెలిపింది.

మహిళా భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -దేవరపల్లి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు శనివారం వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించారు. దుద్దుకూరులో బాలికల హాస్టల్‌లో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళా భద్రత, మహిళా శక్తి వంటి అంశాలపై వివరించారు. దేవరపల్లిలోని భాష్యం హర్షవర్ధన్ స్కూల్‌లో ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల భద్రత, బాలికలపై లైంగిక నేరాలు, నేటి సమాజంలో నేర నియంత్రణలో టెక్నాలజీ ప్రాధాన్యత, పోలీసుల పాత్ర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేవరపల్లి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, ట్రైనీ ఎస్ఐ పి.దినేష్, మహిళా కానిస్టేబుల్ రాపాక బాలశ్రీ, మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గడప దాటుతున్న కలప

యథేచ్ఛగా వృక్షాల నరికివేత

ఫారెస్ట్ రేంజి పరిధిలో అక్రమార్కులు

అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

బొమ్మూరు కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద రంగంపేట మండలం వడిసలేరులో రూ.15 కోట్ల అంచనాతో ఫర్నిచర్ క్లస్టర్ ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేసి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. రాజానగరం మండలం కలవచర్లలోని ఎంఎస్ఎంఇ పార్కులో గ్రాఫైట్, బంకమట్టితో క్రూసిబుల్స్ తయారీ పరిశ్రమతో పాటు సిరామిక్ క్లస్టర్ ఏర్పాటు కోసం అవసరమైన భూమిని ఎపిఐఐసి ద్వారా కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద 2024-25లో రూ.15.67 కోట్ల మార్జిన్ మనీతో 372 యూనిట్లు, 2025-26లో రూ.13.60 కోట్ల మార్జిన్ మనీతో 287 యూనిట్లు గ్రౌండ్ అయ్యాయని కలెక్టర్ తెలిపారు. బ్యాంకర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న లోన్ దరఖాస్తులను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఆగస్టు నెల నుంచి జిల్లాలో వివిధ పారిశ్రామిక విధానాల కింద వచ్చిన 16 క్లెయిములకు సంబంధించిన రూ.16.53 కోట్ల రాయితీలను స్క్రూటినీ, వెరిఫికేషన్ కమిటీ ఆమోదించిందని తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా గత జూలై నుండి అక్టోబర్ వరకు వివిధ శాఖల పరిధిలో 3,246 దరఖాస్తులు రాగా, వాటిలో 3,174 దరఖాస్తులు ఆమోదించగా, 71 దరఖాస్తులు పెండింగ్‌లో, ఒక దరఖాస్తు తిరస్కరించినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలోనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. రాజమహేంద్రవరం అల్యూమినియం వర్కర్స్ కాలనీలో అల్యూమినియం సర్కిల్స్, పాత్రల తయారీ కోసం గోదావరి రోలింగ్స్ అసోసియేషన్ క్లస్టర్ ఏర్పాటు చేసుకోవడానికి కమిటీ అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వి.రామన్, ఎపిఇఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ బి.పద్మజాదేవి, డిఆర్‌డి పీడీ ఎన్‌విఎస్ఎస్‌మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-ఉండ్రాజవరం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న శేషారావు

ఇటీవల వివిధ అనారోగ్యాల కారణాలతో వైద్యం పొంది, హాస్పిటల్‌కు చెల్లించాల్సిన బిల్లు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు శనివారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణ, మండలం, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన మొత్తం 38 మందికి రూ.23 లక్షల 80 వేల 400 రూపాయల చెక్కులను ఆయా బాధితుల కుటుంబ సభ్యులకు వేలివెన్ను లోని ఆయన స్వగృహంలో అందజేశారు.

విజేతలుగా వీరవరం హైస్కూల్ బాలికలు

ప్రజాశక్తి-కడియం



విజేతలైన విద్యార్థినులతో హెచ్ఎం విశ్వనాథ్

వికసిత్ ఆంధ్రప్రదేశ్ ద్వారా దేశాభివద్ధి, భారత రాజ్యాంగం, భారత స్వాతంత్ర్య పోరాటం అంశాలపై నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీలలో వీరవరం జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలు ప్రతిభ కనబరిచారు. మండలం కేంద్రమైన కడియం హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థిని ఎన్.గౌతమి వ్యాస రచనలో ప్రథమ స్థానం, ఉచ్చారణ, క్విజ్‌లలో పదవ తరగతి విద్యార్థిని కె.సంధ్య ప్రథమ స్థానం, ఆర్.పావని ద్వితీయ స్థానం సాధించారు. పాఠశాల హెచ్ఎం ఎన్.పి.కె విశ్వనాథ్ విజేతలను అభినందించారు.



డిఎస్‌సి విజేతలను సత్కరిస్తున్న ఎంపిడిఒ తదితరులు

డిఎస్‌సి విజేతలకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గోపాలపురం

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని ఎంపిడిఒ జి.రాజమనోహర్ అన్నారు. శనివారం స్థానిక శర్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 2025 డిఎస్‌సికి ఎంపికైన ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు తిలక్ మహమ్మద్ సబ్రీన్, కాకులపాటి భరత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదల కృషి ఉంటే దేనినైనా సాధిస్తారని అందుకు పేదరికం అడ్డు రాదని శర్వాణి రెసిడెన్షియల్ స్కూల్ పూర్వ విద్యార్థులు అందుకు నిదర్శనమని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు మంచి చదువు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ గౌరవప్రదమైన స్థానం ఉండేది ఉపాధ్యాయులకేనని, వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో ఉన్న వారందరినీ తయారు చేసింది ఉపాధ్యాయులేనని, ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అందుకు కృషి చేయాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ఎఎస్ఒ జొడాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రాపాక ఫణి కిషోర్ అభినందించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ఆచార్య ప్రసన్నశ్రీ

10, 11న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-రాజానగరం

నవంబర్ 10, 11 తేదీల్లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ మెన్ అండ్ ఉమెన్ టీమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారని విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. తన ఛాంబర్‌లో శనివారం ఆమె బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ దీన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులకు సూచించారు. అథ్లెటిక్స్‌లో మొత్తం 26 క్రీడా పోటీలు ఉంటాయని, కావున సమష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆదేశాల మేరకు మినిమమ్ క్వాలిఫైయింగ్ స్టాండర్డ్స్ ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు ఆర్‌కె, ఆచార్య కె.వి.స్వామి, అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ ఎంవిఎస్ఎస్ఎన్.మూర్తి, ఎం.ప్రసాద్, పివివి.లక్ష్మి, టి.విజయదుర్గ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి-గోకవరం, చాగల్లు

వైసిపి హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ గోకవరం మండల కేంద్రంలో వైసిపి నాయకులు దాసరి చినబాబు గృహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు పాటి రాంబాబు ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. దాసరి చినబాబు, గుల్లా ఏడుకొండలు, తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, మడికి మైనరబాబు, అంబటి అబ్రహం, బిజ్జి రాజు పాల్గొన్నారు.

చాగల్లులో మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిశీలకుడు గిరజాల బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, బొర్రా రజని, ఎంపిపి మట్టా వీరాస్వామి పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి-చాగల్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వమిత్వ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్ పూర్తయినందున షేప్ ఫైలింగ్ పూర్తి చేసి ప్రతి యజమానికీ వ్యక్తిగత పిపిఎంలు ఇచ్చే విధంగా తయారీ పనులు, ఈ నెలాఖరు నాటికి పూర్తి చెయ్యాలని కోరారు. స్వమిత్వ సర్వే చాగల్లు, బ్రాహ్మణగూడెం, కలువలపల్లి, చిక్కాల, ధారవరం, ఊనగట్ల, మల్లవరం, గౌరిపల్లి, చంద్రవరం పంచాయతీల్లో నిర్వహిస్తారని తెలిపారు.

విధుల్లోకి ప్రభుత్వ వైద్యులు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో 24 రోజులుగా సమ్మె చేస్తున్న వైద్యులు శుక్రవారంతో సమ్మె విరమించారు. పీజీ విద్యలో సర్వీస్ కాటన్ 15 శాతానికి తగ్గించిన కారణంగానే ఏజెన్సీ అలవెన్స్ చెల్లించాలని 104 అలవెన్స్ ఇవ్వాలని డైరెక్టర్ డిమాండ్లతో వైద్యుల సంఘం సమ్మెకు దిగింది. శుక్రవారం ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో వైద్యులు సమ్మెను విరమించారు. శనివారం నుండి వైద్యులు విధుల్లో కొనసాగుతున్నారు.

సురక్ష యాప్‌పై కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి-కొవ్వూరు

నకిలీ మద్యం నియంత్రణ ప్రజా ఆరోగ్య భద్రతలో భాగంగా కూటమి నాయకులు శనివారం సురక్ష యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి మద్యం దుకాణాలకు వెళ్లి వినియోగదారులకు సురక్ష యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆ మద్యం ప్రభుత్వ గుర్తింపు పొందినదా, లేక నకిలీదా అనేది తెలుతుందని, బాటిల్‌పై స్కానింగ్ చేసి చూపించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపునేని చిన్ని, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, నాయకులు బర్ల శ్రీనివాస్, ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి భాష్యం స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.పేరయ్య నాయుడు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థుల్లో అండర్-17 చెస్ విభాగంలో పి.రఘు, ప్రబోధ్ వర్మ మొదటి స్థానం, ఎస్.జస్వంత్ రన్నింగ్‌లో ఎం.దిగ్విజయ్, షాట్‌పుట్‌లో పి.చరణ్ అక్షయ్ కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అండర్-14 చెస్, షాట్‌పుట్‌లో రచన శాన్వి, ఎన్.లోకేష్ ద్వితీయ, ప్రథమ స్థానాలు సాధించారు. ఈ విజయంపై భాష్యం స్కూల్స్ జోనల్ ఇన్‌ఛార్జి వి.ఆంజనేయులు, చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా విజేతలను అభినందించారు.

ఆలయానికి ఉప సర్పంచ్ రామ్‌జీ విరాళం

ప్రజాశక్తి-కడియం

బుర్రిలంకలోని శ్రీగంగమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి కడియపులంక ఉప సర్పంచ్ పాతంశెట్టి వెంకట రామారావు (రామ్‌జీ) రూ.1,00,116 విరాళం అందించారు. శనివారం బుర్రిలంకలో అభివద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి గంగమ్మ తల్లి ఆలయానికి వచ్చారు. ఎంఎల్ఎ ద్వారా ఆలయ కమిటీకి ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, చిరు సేవా సమితి అధ్యక్షులు గడ్డం శివ, గట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ హైస్కూల్ పక్కన ఉన్న ఎలక్ట్రికల్ షాప్ సమీపంలోని కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అమీనాబాద్ గ్రామానికి చెందిన దయలపల్లి ఆంధ్రయ్య (55) శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఎలక్ట్రికల్ షాప్ పక్కన ఉన్న కాలువ వద్ద పడుకొని ఉండగా శనివారం ఉదయం ఉప్పాడ పంచాయితీ స్లీపర్లు ఆంధ్రయ్యను ఎంత లేపిన స్పందించకపోవడంతో స్లీపర్లు వెళ్లిపోయారని తెలిపారు. కాసేపటి వ్యవధిలో ఆంధ్రయ్య కాలవలో పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట, గోకవరం, పెరవలి

జగ్గంపేట మండలంలోని సీతారాంపురంలో కోడి పందేలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ వెల్లడించారు.

గోకవరం మండలం మల్లవరంలో కోడిపందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కొత్తపల్లిలో బొమ్మా బొరుసు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పెరవలి మండలం కాపవరంలో పేకాడుతున్న ఆరుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5120 నగదు, కొత్తపల్లి అగ్రహారంలో పేకాడుతున్న ఐదుగురు వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

వ్యాన్‌ను ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డులోని పతంజలి పామ్ టెక్ పరిశ్రమ ఎదురుగా కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఐసర్ వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో స్థానిక ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి చేరుకొని హైడ్రా క్రెయిన్ సహాయంతో కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. కోడిగుడ్లు పాడయ్యాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ షాకు గురై కార్మికు డు మతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో గడ్డిని కోస్తుండగా బియ్యంపేటకు చెందిన దొంగ భీమన్న(46) విద్యుత్ ప్రమా దానికి గురై మృతి చెందాడు. మృతుని కుమారుడు దూడలు వీరబాబు ఈ విషయమై ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ర్యాంపులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - కొవ్వూరు

వాడపల్లి ఇసుక ర్యాంపులో రీజినల్ విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ ఎడిటి కిషోర్ శనివారం రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా నుంచి ఇసుక తెలంగాణ ప్రాంతానికి తరలిపోతోందని ఇచ్చిన నివేదిక మేరకు ఇసుక ర్యాంపుల్లో రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రీజనల్ పరిధిలో రెండు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రోజు విడిచి రోజు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాడపల్లి ర్యాంపులో ఇసుక తరలింపుకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా బోర్డర్ పరిధిలో ఉన్న మండలాలకు ఇసుక సరఫరా చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే అనుమతించాలని సిబ్బందికి సూచించారు.

వాడపల్లికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం కార్తీక మాసం మొదటి వారం కావడంతో యాత్రికులు పోటెత్తారు. సుమారు 80 వేల పైబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్‌రావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు.

జాతీయ పోటీలకు శ్రీగౌతమి విద్యార్థిని

ప్రజాశక్తి -గోపాలపురం

పంజాబ్‌లో జాతీయ స్థాయి సెపక్‌తాక్రా పోటీలకు శ్రీగౌతమి కళాశాల విద్యార్థిని మంచిలి లాస్య ఎంపికైనట్లు సెక్రటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం తెలిపారు. ఇంటర్ ప్రథమ విద్యార్థిని మంచిలి లాస్య అక్టోబర్ 11, 12వ తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు నవంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలో నిర్వహిస్తారని తెలిపారు. ఆ విద్యార్థిని ఆర్థిక స్తోమతను దృష్టిలో పెట్టుకొని కళాశాల తరపున విద్యార్థినికి రూ.7,000 సాయం అందించినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపల్స్ వై.ప్రసాద్, కె.సంపత్ కుమార్, పీడీ సాయి కుమార్ పాల్గొన్నారు.

మన్నే కుటుంబానికి తోట పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

తిరుమలాయపాలెంలో ఇటీవల మరణించిన మన్నే మంగయమ్మ కుటుంబ సభ్యులను వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం శనివారం పరామర్శించారు. తోట శ్రీరామ్‌జీ, గుల్ల ఏడుకొండలు, పాటి రాంబాబు, మన్నె బుజ్జి, ఉప సర్పంచ్ దాకవరపు దుర్గాప్రసాద్, గునుపే ఏడుకొండలు, మంగాల ఆనందం పాల్గొన్నారు.

భద్రత కల్పించలేమా..?

భేటీ పడావో... భేటీ బచావో పేరుతో కేంద్రం, బాలికల రక్షణకు చర్యలు అంటూ రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు అంతా ఇంతా కావు... ఇందులో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులతో పాటూ అధికారులు ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. ఈ కార్యక్రమాల్లో బాలికల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామంటూ నేతలు చేస్తున్న ప్రసంగాలు ప్రతి రోజూ ఏదొకమూల వింటూనే ఉన్నాము. మీడియాలో ఈ మేరకు వస్తున్న వార్తలు కూడా కోకొల్లలు. కాని పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలు మాత్రం కార్యాచరణలో కానరావట్లేదు. ఫలితంగా బాలికలకు భద్రత కల్పించలేమా? అనే ప్రశ్నకు కల్పించలేము అనే సమాధానమే వస్తుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన వరుస ఘటనలే దీనికి నిదర్శనంగా నిలిచాయి. హాస్టల్ నుంచి ఒక విద్యార్థిని, గురుకులం నుంచి మరో విద్యార్థిని బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటనలు తీవ్ర సంచలనం రేపాయి. ఈ రెండు ఘటనలు పరిశీలిస్తే పాలకుల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రెండు ఘటనల్లోనూ సిబ్బంది వైఫల్యం కనిపిస్తున్నా... దీని వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం దాగి ఉంది.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఒక యువకుడు బైకుపై తీసుకెళ్లాడు. వారితో పాటూ మరో యువకుడు కూడా వెళ్లారు. బాలికను ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక తల్లి కాల్ చేసిన సమయంలో గాయాలను చూసి ఆరా తీసేవరకూ హాస్టల్ సిబ్బంది సైతం గుర్తించలేని పరిస్థితి ఉంది. ఎట్టకేలకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసినట్లు ఈ నెల 23న ప్రకటించారు. తుని ఘటన సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉంది. 62 ఏళ్ల వృద్ధుడు అభం శుభం తెలియని బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దర్యాప్తులో మూడు సార్లు అత్యాచారం చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. మనవరాలి వయస్సున్న బాలికపై అత్యాచారానికి దిగిన నిందితుడిని పట్టుకున్న స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం పరిణామాల్లో నిందితుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఈ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ రెండు ఘటనలూ హాస్టల్స్‌లో చదువుతున్న బాలికలు, వారిని చదివిస్తున్న తల్లిదండ్రుల్లో భయాందోళనలను సృష్టించాయి. ఇదే సమయంలో హాస్టల్స్‌లో బాలికల రక్షణ ఎంతనే చర్చ కూడా వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్ల, గురు కులాలు, కస్తూరిబా పాఠశాలలను నేటికీ సిబ్బంది కొరత వేధిస్తుంది. మెజారిటీ వసతిగృహాల్లో రక్షణ చర్యలు శూన్యం. కనీసం వాచ్‌మెన్ లేని పరిస్థితులూ ఉన్నాయి. భవనాలకు సైతం రక్షణ లేని పరిస్థితి. కొన్ని హాస్టళ్లకు ప్రహరీలు కూడా లేవు. మరికొన్ని హాస్టళ్లలో వార్డెన్లు లేరు. ఈ నేపథ్యంలో బాలికల రక్షణ ఎలా సాధ్యమవుతుంది అనేది ప్రశ్న. ప్రభుత్వాలు బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నా.. బడ్జెట్‌లో మాత్రం దీనికి సంబంధించిన కేటాయింపులు అరకొర మాత్రమే. ఏదైనా ఘటన జరిగినప్పుడు సంబంధిత హాస్టల్ వార్డెన్లు, లేదా ఇతర సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకోవడం పరిపాటిగా మారింది. కాని మూలాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. జరిగిన ఘటనలను పరిగణలోకి తీసుకుని ఇప్పటికైనా బాలికల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు విద్యార్థులు తల్లిదండ్రులు.

గోదారి గలగలలు

డబ్బే పరమావధిగా పనిచేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ యాజమన్యాలు. ప్రయాణికులు భద్రతను గాలికొదిలేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. వారి ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కర్నూలులో జరిగిన దుర్ఘఘటన ఈ విమర్శలకు మరో సాక్ష్యంగా నిలిచింది. ఈ ఘటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనూ విషాదాన్ని నింపింది. డాక్టర బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డి ఈ ఘటనలో సజీవ దహనమయ్యాడు. భార్య, ఇద్దరు పిల్లలతో పాటూ వృద్ధులైన తండ్రి, మావయ్య అందరూ శ్రీనివాసరెడ్డిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బెంగళూరు వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వారి కుటుంబం వీధిన పడింది. చిన్నారులైన ఇద్దరి పిల్లలతో శ్రీనివాసరెడ్డి భార్య రోధిస్తున్న తీరు అందర్నీ కంట తడి పెట్టించింది. ప్రయివేటు ట్రావెల్స్‌పై అధికారులు ఆజమాయిషీ లేకపోవడం, ముడుపులు ఇతర కారణాలతో చూసీచూడకుండా వదిలేయడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గుణపాఠం నేర్చుకుని ప్రయాణికులకు భద్రత కల్పించాలని కోరుకుందాం.



విచారణాధికారులతో మాట్లాడుతున్న బయట వ్యక్తులు

పి.గన్నవరం సిహెచ్‌సిలో వైద్యాధికారుల విభేదాలపై విచారణ

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం కమ్యూనిటీహెల్త్ సెంటర్(సిహెచ్‌సి)లో వృత్తిపరమైన నిబంధనలో ఇద్దరు వైద్యాధికారుల మధ్య తలెత్తిన వివాదంపై విజయనగరం డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎన్.పద్మావతి, వైజాగ్ సిఎస్‌ఎస్ డాక్టర్ ఎం.లక్ష్మీ ప్రసన్నలతో కలిసి శుక్రవారం విచారణ నిర్వహించారు. వైద్య సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి విచారణ నిర్వహిస్తున్న సమయంలో కొంత మంది బయట వ్యక్తులు సూపరింటెండెంట్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. దీనితో విచారణ చేయాలా వద్దా అనే విచారణ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. విచారణ సమయంలో బయట వ్యక్తులు జోక్యం చేసుకోవడం ఎంతవరకు సబబు అని విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణకు ఆటంకం కలగడంతో విచారణ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. విచారణ నిర్వహించి నివేదికను విచారణాధికారులు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎంఎల్‌ఎ జోక్యంతో మహిళా వైద్యాధికారిపై కమిషనరేట్‌కు ఫిర్యాదు చేయడంతో నెలరోజుల క్రితం విచారణ జరిగింది. విచారణ ఏకపక్షంగా కాకుండా రాజకీయ జోక్యం లేకుండా సమగ్రంగా విచారణ జరుగుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

హ్యూమానిటీ క్లబ్ ఛైర్మన్‌గా విద్యానిధి నాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం



విద్యానిధి నాయుడుతో జివి.రావు

మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ భావనతో ప్రారంభించనున్న హ్యూమానిటీ క్లబ్ 21వ ఛైర్మన్‌గా విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఎబి. నాయుడుని నియమించారు. ఈ మేరకు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మోడరన్ హ్యూమానిటీ క్లబ్‌కి సంబంధించిన ప్రతిపాదనను తెలియజేశారు. హ్యూమానిటీ క్లబ్ యూనిట్స్ ఛైర్మన్‌గా ఆయనను జివి.రావు సాదరంగా ఆహ్వానించారు. దీనికి నాయుడు సానుకూలంగా స్పందించి తాను రెండు యూనిట్ల భాద్యత తీసుకోవటానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు జివి.రావు తెలియజేశారు. నాయుడు ఆధ్వర్యంలో 60 మంది సభ్యులు కూడా సభ్యత్వం తీసుకొనడానికి సుముఖత చూపారని రావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా మరింత విస్తతం చేస్తూ ప్రణాళికబద్ధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఆయన వివరించారు. 'ఆకలి లేని సమాజం' అనే ఆశయ సాధనతో తాను తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ స్వాగతించి మద్దతుగా నిలుస్తారని జివి.రావు ఈ సందర్భంగా తెలియజేశారు.

'వాయిస్ యాక్టివేటెడ్'తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మహిళలు ఆపద సమయంలో వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్‌తో వారకి రక్షణ కలుగుతుందని భీమవరం బిఫార్మసి విద్యార్థులు పేర్కొన్నారు. వివరాలు ఇవి..మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన హనుమంతు మౌనిక ఆదిత్య భీమవరంలో బిఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతోంది. తోటి విద్యార్థులు శ్రీవల్లిక, వైనిగ్న, శారదతో కలసి వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ ప్రాజెక్టును తయారు చేశా రు. వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ ప్రాజెక్టు జిపిఎస్ ట్రాకర్, అనుసంధానమే ఉంటుంది. దీని వల్ల మహిళలకు ఏదైనా ఆపద సంభవిస్తే ఎమర్జెన్సీలో ఎవరు సహాయం లేకుండా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు, షిటీంకు, లేదా దగ్గర్లో ఉన్న బంధువులకు ఆటో మెటిగ్గా ఫోన్ కాల్స్ వెళ్తుంది. దీని ద్వారా మహిళలు ఆపదలో ఉన్నప్పుడు వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ వారికి రక్షణగా నిలుస్తుందని ఆదిత్య పేర్కొంది. విద్యార్థులతో ఈ ప్రాజెక్టును చేయడం తనకు గర్వంగా ఉందని తోటి విద్యార్థులు కూడా ఈ ప్రాజెక్టును తయారు చేయడానికి శ్రమించారని ఆమె తెలిపింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ మహిళలకు రక్షణ కరువైందని వాయిస్ యాక్టి వేటెడ్ పెండెంట్ బాలికలకు, మహిళలకు రక్షణగా నిలు స్తుందని ఈ సందర్భంగా పలువురు అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రథమ స్థానం నిలిచిందని విద్యార్థులను ప్రిన్సిపల్ నటరాజన్ అభినందించారు.

టాటా ఎలక్ట్రానిక్స్‌కు 42 మంది ఎంపిక

ప్రజాశ క్తి - అమలాపురం

వికాస ఉద్యోగమేళాలో ఎంపికైన 42 మంది అభ్యర్థులను టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీకి బస్సు ఏర్పాటు చేసి పంపించామని వికాస ప్రాజెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. వీరంతా అభ్యర్థులు కోనసీమ జిల్లా నుంచి హోసూర్ తమిళనాడులో గల టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీకి జాయినింగ్ నిమిత్తం వెళ్త న్నారని ఆయన తెలిపారు. వీరికి 19400 సిటిసి లభిస్తుందని మరియు ఉచిత భోజనం వసతి కూడా ఏర్పాటు చేస్తారని ఆయన తెలిపారు. అందరూ కష్టపడి పని చేసి తమ ఉద్యోగానికి న్యాయం చేసి మరింత ఉన్నత స్థానాలు అందుకోవాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వికాసా జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, వికాస ప్రతినిధులు ఎం. రవితేజ, రాజా రమేష్ లు పాల్గొన్నారు.

27 నుంచి అమలాపురం - రాజమండ్రి నాన్‌స్టాప్ సర్వీసులు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నుంచి రాజమండ్రికి వెళ్ళే ప్రయాణికుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని అమలాపురం – రాజమండ్రి నాన్‌స్టాప్ అల్ట్రా డీలక్స్ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.టి.పి. రాఘవకుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సర్వీసులు అక్టోబర్ 27 నుంచి ప్రారంభం కానున్నాయని బస్సు అమలాపురం ఈదరపల్లి వయా ముక్కామల మీదుగా ప్రయాణిస్తుందని ఆయన వెల్లడించారు.

అన్నప్రసాదానికి రూ.1లక్షా 15 వేల వితరణ

ప్రజాశక్తి-మామిడికుదురు



దాతకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

పాశర్లపూడి బాడవకు చెందిన కటిగిరెడ్డి రామకృష్ణ, ఆదిలక్ష్మి దంపతుల కుమారులు గంగాధరరావు, మాధవిశైలు దంపతులు, వారి కుటుంబ సభ్యులు శనివారం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. 2,400 మంది యాత్రి కులకు అన్నప్రసాద వితరణ జరిపించు నిమిత్తం రూ.1,15,200 విరాళముగా సమర్పించారని ఆలయ సహయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు . వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శ్రీ స్వామివారి చిత్రపటమును అందజేసినారన్నారు

తుపాను ప్రభావంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఈనెల 27, 28, 29 తేదీలలో కోనసీమ జిల్లాలో తుపాను ప్రభావం ఉంటుందని, స్థానికంగా తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనల మేరకు రామచంద్రపురంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ దేవరకొండ అఖిల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డివిజన్‌లో భారీ వర్షాలు, తుపానుల కారణంగా డివిజన్ పరిధిలోని అన్నీ మండలముల లోని 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. 23 నుంచి 30. వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. తుపాను ప్రభావంతో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంప్రదించాలని కంట్రోల్ రూమ్ ఫోను నెంబరు 08857 – 245166 ఆర్‌డిఒ తెలిపారు.

అభివృద్ధిలో మహిళల పాత్రపై అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

పరిపాలన అభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులకు హైదరాబాద్ బోస్కో సేవా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పారా సంస్థ వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ సోడా బత్తిన అంబేద్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పరిపాలన అభివృద్ధిలో మహిళా పాత్ర, ఎదుర్కొన్న సమస్యలను నెట్‌వర్క్ రూపంలో సాధించిన విజయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంబేద్కర్ మాట్లాడుతూ పరిపాలన అభివద్ధిలో మహిళలు కూడా పురుషులతో పరిపాలనలో సమానంగా గ్రామాన్ని అభివద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో టి.రమేష్, పారా కో–ఆర్డినేటర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వీ లీడ్ మూడు మండల ఇన్‌ఛార్జిలు పోతుమూడి శేషారత్నం, వెజ్ డైరెక్టర్ పి.శాంత కుమారి తదితరుల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం గ్రామ సర్పంచ్ గెడ్డం సుధా, ర్యాలి గ్రామ సర్పంచ్ కె.లక్ష్మి, కొత్తపేట గ్రామ సర్పంచ్ బూసి విజయలక్ష్మి, లక్ష్మీ పోలవరం గ్రామ సర్పంచ్ హేమలత, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు వివిధ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణకు రచ్చబండ

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సూచన మేరకు మండలంలో మూలస్థానంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన కోటి సంతకాల సేకరణకు రచ్చబండ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి ఇన్‌ఛార్జి తోరాటి రాంబాబు, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నియోజవర్గ బూత్ కన్వీనర్ నామాల శ్రీనివాస్, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు, మాజీ సొసైటీ ఛైర్మన్ నల్లి రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు తోట కొండయ్య, తోరాటి గోవిందు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మంత్రి దుర్గేష్ పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంకలో మృతుని కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం నేతలతో కలిసి పరామర్శించారు. చెముడులంకకు చెందిన సిద్ధిరెడ్డి గణేష్ కడియపులంకలో పూల వ్యాపారం చేసుకుంటూ తన కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల గుండెపోటుకు గురై మరణించాడు. శనివారం మంత్రి దుర్గేష్ పార్టీ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ప్రభుత్వం నుంచి రావలసిన అన్నింటిని త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటానని బాధితులకు హామీ ఇచ్చారు. దుర్గేష్ మాట్లాడుతూ జనసేనకు అత్యంత విధేయతతో ఉంటూ తన అమూల్యమైన సేవలు అందిస్తూ చురుకుగా గణేష్ వ్యవహరించేవాడన్నారు. అలాంటి వ్యక్తిని పార్టీ కోల్పోవడం తీరని లోటన్నారు. కార్యక్రమంలో నేతలు గట్టి నరసయ్య, పుల్ల చిట్టిబాబు, అడబాల వీర్రాజు, అడబాల శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరికపై కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - కొత్తపేట

విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ లో చేరడానికి మూడ , ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ దశలలో సీట్లు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిఎ, బికాం, బిఎస్‌సి, మరియు బిజెడ్‌సిలలో వివిధ సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ఈ నెల 25, 26 తేదీలలో చేసుకోవాలని, వెబ్ ఆప్షన్లను ఈ నెల 28, 29 తేదీలలో నమోదు చేసుకోవాలని, సీట్ల కేటాయింపు నవంబరు 1 న ఉంటుందని, సీట్లు పొందినవిద్యార్థులు నబంబరు 4 లోపు కళాశాలలో రిపోర్టు చేయవలసి ఉంటుందని తెలిపారు. కొత్తపేట, పరిసర ప్రాంత్రాలలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవంబర్ 8న బౌద్ధ వారసత్వ ఉత్సవం

ప్రజాశక్తి-రాజానగరం

నవంబర్ 8న నిర్వహించే కోరుకొండ కాపవరం బౌద్ధ వారసత్వ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (తారకం) రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనాల లాజర్ పిలుపు ఇచ్చారు. సూర్యారావుపేటలో బౌద్ధ ఉత్సవ కమిటీ సభ్యులు మేకల లక్ష్మీపతి ఆధ్వర్యాన శనివారం ఉత్సవ కరపత్రం ఆవిష్కరించారు. బిఎస్‌పి రాజానగరం నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లాటి అబ్బులు, మాలల ఐక్యవేదిక కన్వీనర్ ముప్పిడి, ఐక్యవేదిక కార్యదర్శి ప్రత్తి నాగేశ్వరరావు, ఐక్యవేదిక సభ్యులు మేకల చిన వీర్రాజు, కొల్లాటి చినవెంకన్న, బేదంపూడి సూర్యారావు, గొంతి శివ, జాలెం కుమార్, బొర్రా కాశి, నాగారపు అనందరాబు, పేకల సారంగ, తలారి సూరిబాబు పాల్గొన్నారు.

27న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 27న సోమవారం ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.రవి వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలు నందు ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని అన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కమిషనర్ కోరారు.

పాస్‌బుక్ టైటిల్‌డీడ్ పోయినది

మడక సత్యనారాయణ, S/o. అప్పన్న, డో.నెం. 1-26, చంద్రేడు, రంగంపేట మండలం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న మా తండ్రి గారు అయిన (లేటు) **మడక అప్పన్న,** S/o. కన్నయ్య పేరున గల రిజిష్టర్ దస్తావేజు **1775/1965** ఆస్తికి సంబంధించిన **పట్టాదారు పాసుబుక్** మరియు టైటిల్ డీడ్ Sq. No. 175/2 (Old), 175/2C New, LP No. 886 extent Ac. 0.50 cents నెంబర్లు గలవి ది. 01-10-2025వ తేదీన చంద్రేడు నుండి రంగంపేట సెంటర్‌కు బైక్‌పై వెలుతుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

మడక సత్యనారాయణ
సెల్: 9177418707

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్ **పెనుమల్లు రుక్మిణి,** W/o. అప్పారావు, రమణక్కపేట, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా వారి సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకంనకు తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పల్లా అచ్యుయ్యమ్మ అనే వరలక్ష్మి, W/o. పల్లా దక్షిణ కాళీ వరప్రసాద్, పురంవారి వీధి, జగన్నాథపురం, కాకినాడ వారు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తి అమ్మజూపగా మా క్లయింటు కొనుగోలు చేయదలచినారు. దీనిపై ఎవరికైన ఏమైనా ఆక్షేపణలు వున్నచో వారం రోజులు లోపు మా క్లయింటుకు గాని, వారి అడ్వకేట్ అయిన నాకు గాని తెలియజేయవలెను. లేని యెడల తదుపరి వచ్చు ఏవిధమైన క్లెయిములు మా క్లయింటును బైండు చేయజాలవు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, మల్లవరం గ్రామం తాలూకు ఖాతా నెం. 2317, ఎల్పి నెం. 2486 య.0.708ట్లు, ఎల్.పి. నెం. 2487 రు య. 0.70ట్లు భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా హద్దులు : **తూర్పు** : తటవర్తి సుబ్బారావు, **పడమర** : కొత్త చెరువు గట్టు, **దక్షిణం** : మేడిశెట్టి వెంకటలక్ష్మి పాలపర్తి రాముడు, **ఉత్తరం** : పాలపర్తి వెంకన్నదొర

వి.వి.నగేష్, అడ్వకేట్
పిఠాపురం, సెల్ : 9440318115

ప్రకటన



కీ॥శే॥ ఆకుల మాణిక్యం (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, గోపవరం, డో.నెం. 2–96 కాపురస్తులు ఆకుల సూర్యనారాయణ, S/o. చిన సూరన్న ఇచ్చిన పత్రికా ప్రకటన.

నా భార్య **ఆకుల మాణిక్యం** గోపవరం గ్రామంలో మా ఇంటి వద్ద 19–4–2005 సం॥రంలో మరణించారు. వీరి మరణం గోపవరం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: ఆకుల సూర్యనారాయణ
S/o. చిన సూరన్న (లేటు), డో.నెం. 2-96,
గోపవరం గ్రామం, ఉప్పలగుప్తం మండలం
సెల్: 8143283488

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
H.M.O.P. No. 69/2025

Between:

వెలవలపల్లి వెంకట శివకుమార్ **–పిటీషనర్**

Vs

వెలవలపల్లి (ఈమని) వెంకట సూర్య సాయి నాగ దీప్తి, W/o. వెంకట శివకుమార్, వయస్సు 20 సం॥లు, గృహిణి, D/o. ఈమని గణపతి శాస్త్రి, డో.నెం. 5/9/151/1, ప్రశాంత్ నగర్ ఏరియా, షిర్డిసాయిబాబా గుడి, గోకుల్ ప్లాట్స్, 9th ఫేజ్, KPHB కాలనీ, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం. **–రెస్పాండెంట్**

యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు పిటీషనులో పిటీషనరు పై కోర్టు నందు రెస్పాండెంటు యైన మీపై విడాకులు కోరుచూ పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు కోర్టు ద్వారా పంపించిననూ మీరు తీసుకొని యుండలేదు. కావున మీరు **దివి. 14-11-2025 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥** లగాయితు పై కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెనని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

కుడుపూడి శ్రీనివాస్
అమలాపురం — అడ్వకేట్, అమలాపురం
ది. 25-10-25 — సెల్: 9493139229

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కొవ్వూరు, తూ॥గో॥జిల్లా (పశ్చిమగోదావరి జిల్లా)

O.S. No. 93/2015

Between:

1. Guda Seetharamanjaneyulu and Others **–వాదులు**

AND

1. Guda Venkataramana Sitaramanjaneyulu and Others **–ప్రతివాదులు**

పై నెంబరు దావాలో యిందలి ప్రతివాదులు యిన D-21: కరుటూరి లలిత భవాని, D-22: బిక్కిన రామరావు, D-24: శ్రీమతి బిక్కిన హనుమ, D-26: యేలేటి ప్రకాశం అనువార్లకు శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు పంపించినను కావాలని తిరస్కరిస్తున్నారు. అందువలన పైన ఉదహరించిన ప్రతివాదులు **ది. 30-10-2025న** శ్రీ కోర్టు వారి ముందు మీరు స్వయంగా గాని లేదా మీ లాయరు గారి ద్వారా హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎం.డి.వి.ప్రసాద్
కొవ్వూరు — వాదులు తరపు లాయరు
25-10-2025 — సెల్: 944059615

In the Court of the III Additional District Judge, Kakinada

I.A. No. 1246/2022 in A.S.S.R. No. 4789/2022

Between:

Kondeti Srinivas
...Petitioner/ Appellant/ Plaintiff

AND

Lolla Padmalakshmi & another
...Respondents/ Defendants

To:

Respondent/ Defendant-1: Lolla Padmalakshmi, living with Paramour, Gopi Veera Venkata Satyanarayana, House wife, Residing in the house of Kondeti Govindarajulu, Behind Durga Bar, Uday Krishna Vamsi Nagar, 8th Street, Yanam, Pandicherry State.

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 10-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వి.ఎన్.వి.వి.శ్రీరామమూర్తి, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848820708

ప్రకటన

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అడిషనలు సీనియర్ డివిజన్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 68/2025 And
I.A. No. 363/2025
O.S. No. 68/2025

Between:

Chitturi Anjaneyulu, S/o. Ganga Raju, Rajamahendravaram
...Plaintiff/ Petitioner

AND

Rongala Veera Venkata Naga Lakshmi and Others
...Defendants/ Respondents

D-2/R-2: Bobbili Naga Lakshmi, W/o. Satyanarayana, D.No. 17-5-35, Rice Peta, Ramachandrapuram, RC Puram JCJC.

D-3/R-3: Devarapudi Venkata Ganapathi, S/o. Bhanu Rao, House No. 2-4-1033, Plot No.8, Capital Market, Nagole, Samanthapuri Colony, Saroor Nagar, Rangareddy District, Telangana State.

D-4/R-4: Rayudu Johnson, S/o. Rangarao, H.No. 11/166/A, Srinagar Colony, Lenin Nagar, Meerpet Panchayat, Hyderabad - 500079.

పై నెంబరు దావా మరియు Injunction Petition I.A. 363/2025 లోను D2 to D4 and R2 to R4 లకు నోటీసు నిమిత్తం దివి. 20–11–2025 నకు వాయిదాలు అయియున్నవి. సదరు విషయమై D2 to D4 మరియు R2 to R4 లకు ఏమయినా ఆక్షేపణలున్న ఎడల వారు **ది. 20-11-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, అడ్వకేట్స్ గార్ల ద్వారా గాని హాజరై శ్రీ కోర్టు వార్కి మనవి చేసుకొనవలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారిచే Exparty Orders Pass కాబడును.

సిహెచ్.ప్రభాకరరావు
పిటీషనర్/వాది తరపు అడ్వకేట్
రాజమండ్రి — దానవాయిపేట
25-10-2025 — రాజమండ్రి